క్లుప్తంగా

ఎక్సైజ్ పోలీసుల తనిఖీ



వాజేడు : మండల పరిధిలోని పలు కిరాణ దుకాణాలపై సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. కిరాణ షాపుల్లో బెల్టు షాపులను ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తు న్నారనే సమాచారం మేరకు ఈ దాడులను నిర్వహించినట్లు తెలిసింది. మద్యం విక్రయిస్తే చట్టపరంగా చర్యలను తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. పలు దుకాణాలను తనిఖీ చేసినప్పటికి ఎలాంటి మద్యం లభించలేదన్నారు.

ఏజెన్సీ దళితులకు భూమి హక్కు కల్పించాలి



వెంకటాపురం(కె) : ఏజెన్సీలో దళితులు సాగు చేస్తున్న భూమిపై హక్కు కల్పించాలని నేత కాని హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జాడి ఈశ్వర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బెస్తగూడెంలో నేతకాని హక్కుల పోరాట సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని ప్రధాన పార్టీలు తమ మేనిఫెస్టోలో ఏజెన్సీ దళితులకు భూమి హక్కులు ప్రకటించకపో వడం బాధాకరం అన్నారు. ఏజెన్సీలో నివసి స్తున్న గిరిజనేతరులకు ఎలాంటి హామీ ఇవ్వలే దని అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గం నర్సింహారావు, నవీన్, సత్యనారాయణ, సమ్ము ఉన్నారు.

ప్రకృతిని కాపాడుకోవాలి



ఎస్ఎస్‌తాడ్వాయి : ప్రకృతిని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రాంపాక అవిలయ్య అన్నారు. సోమవారం మండల కేం ద్రంలోని జూనియర్ కళాశాలలో మేరీ మట్టి.. మేరా దేశ్ అమృత్ కలశ్ కార్యక్రమాన్ని ఘనం గా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు.ఈ భూమ్మిద మానవుడు ఎంత విధ్వంసం సృష్టించిన భూతల్లి తన పొత్తిళ్లలో దాచుకుంటుందన్నారు. ప్రకృతిని కాపాడు కోవడం మన అందరి బాధ్యత అని విద్యార్థు లకు పిలుపునిచ్చారు. కొమ్మాల సంధ్య, రాములు నాయక్, కిషన్, భిక్షం, శ్వేత, రాజ్‌కు మార్, అశోక్, శ్రీలత, హరికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



కురుసం తరుణ్ మృతదేహం

గోవిందరావుపేట : రోడ్డు ప్రమాదంలో గాయ పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం లోని మొట్లగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివ రాలు ఇలా ఉన్నాయి. మొట్లగూడెం గ్రామానికి చెందిన కురుసం తరుణ్ (25) శనివారం తన అవసరాల నిమిత్తం పస్రాకు ద్విచక్ర వాహనం పై వచ్చాడు. పని ముగించుకొని తిరిగి వెళ్తుండ గా తప్పమంచ సమీపంలో వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురి కాగా తరణ్ తలకు బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు 108 వాహనంలో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరు గైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తర లించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి సాంబలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ మస్తాన్ తెలిపారు.

వినతిపత్రం అందజేత

కాటారం: ఉద్యోగాల క్రమబద్ధీకరణ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ ఉద్యోగులు మంథని ఎమ్మెల్యే, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబుకు విన తిపత్రం సమర్పించారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో సుమారు 22 వేల మంది 18 ఏళ్లుగా ఆయా హోదాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగు లుగా పని చేస్తున్నట్లు శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. అర్హత కలిగి ఉన్నప్పటికీ తమకు ఉద్యోగ భద్రత లేదని విన్నవించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తమను రెగ్యూలర్ చేసేలా మేనిఫెస్టోలో పొందుపర్చాలని శ్రీధర్ బాబును కోరారు.

జ్వరాలన్నీ డెంగీ కాదు

- మాస్క్‌తో మిక్సిడ్ ఫ్లూ వైరస్‌కు చెక్
- జిల్లా వైద్యాధికారి అప్పయ్య



కమలాపురం ఒడిశా కాలనీలో బ్లీచింగ్ చల్లుతున్న అప్పయ్య తదితరులు

మంగపేట : జిల్లా వ్యాప్తంగా జ్వరాల తీవ్రత ఉన్న మాట వాస్తమే అయినప్పటికీ జ్వరాలన్నీ డెంగీ కాదని జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య అన్నారు. మంగపేట పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్‌గా వచ్చే వైరల్ ఫీవర్‌ను డెంగీ అనుకుని ప్రజలు భయాందోళన చెందొద్దన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు జూలై నుంచి ప్రతి నెల 15 రోజులకొసారి గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఏఎన్ ఎం, ఆశ వర్కర్లతో ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహిస్తు న్నామన్నారు. ప్రస్తుతం ప్రజలను పట్టి పీడిస్తున్న ఒంటి నొప్పులు, దగ్గు, జలుబు, జ్వరం మిక్సిడ్, ఫ్లూ వైరస్‌గా గుర్తించామన్నారు. ముఖ్యంగా వైరల్ ఫీవర్ వస్తే ఇమ్యునిటీ పవర్ ఉన్నవారికి 2, 3 రోజుల్లో తగ్గి పోతుందన్నారు. జ్వరం, దగ్గు, జలుబు, ఒల్లు నొప్పులు వస్తే ఆందోళన చెందకుం డా అనుభవం, అర్హత లేని స్థానిక వైద్యులను ఆశ్ర యించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. స్థానిక ఏఎన్ఎం, ఆశ వర్కర్ల సాయంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనుభవం కలిగిన వైద్యులను సంప్రదించి ఆరోగ్య పరీక్షలు, వైద్యం పొంది వారి సూచనలు పాటించాలన్నారు. అదే విధంగా మలే రియా, టైఫాయిడ్, డెంగీ, రక్త పరీక్షల కోసం ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి వేలకొద్ది రూపాయ లు ఖర్చు పెట్టకుండా పీహెచ్‌సీలో అన్ని పరీక్షలు ఉచితంగా పొందాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్లీనిక్‌లు నిర్వహిస్తున్న వారు జ్వరాలతో వచ్చే వారిని డెంగీ అంటు భయబ్రాంతులకు గురి చేయొ ద్దన్నారు. కొందరు మలేరియా, డెంగీ స్ట్రిప్స్‌తో పరీక్షలు నిర్వహించి ఒక్కొక్కరి నుంచి ఫీజుల పేరు తో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని అవసరమైతే పోలీస్ కేసులు నమోదు చేయడం జరుగుతందని హెచ్చరించారు. ఆయన వెంట వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్, స్వప్నిత, సీహెచ్ఓ దుర్గారావు ఉన్నారు.

వైద్య శిబిరాల సందర్శన

మంగపేట మండల పరిధిలో విషజ్వరాలతో మృ త్యువాత పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు రాజుపేట, రమణక్కపేటలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాలను జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య సోమవారం సందర్శించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జ్వరాల తో మృతి చెందిన వారి ఇంటి పరిసరాలు, జనావ సాల్లో పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలించారు.రాజుపే టలో నిర్వహించిన వైద్య శిబిరంలో 132 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా మరో నలుగురు జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. రమణక్కపేటలో చుంచుపల్లి వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం లో 84 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఏడు గురు జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేక రించారు. ఆయా గ్రామాల్లో 500 ఇళ్లలో 1,549 మందిని ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించి 50 మంది జ్వరాల బారిన పడిన వారిని గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం రాజుపేటలోని జయ క్లినిక్ షాపును అప్పయ్య పరిశీలించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారం

- ఎమ్మెల్యే సీతక్క



ములుగు రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు రూరల్ : శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ములుగు ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి సీతక్క ధీమా వ్యక్తం చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల పక్షాన నిలబడేది కాంగ్రెస్ పార్టీ అని సీతక్క అన్నారు. ఈ మేరకు గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని సోమవారం మండల పరిధిలోని బండారుపల్లిలో నిర్వహిం చారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లా డుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జిల్లా లో శాశ్వతంగా నిలిచిపోయే అభివృద్ధి పనులు చేప డుతామన్నారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకు న్నానని, నియోజకవర్గ ప్రజలే తన కుటుంబ సభ్యు లన్నారు. అందుకే ఏ కుటుంబంలో చావు అయినా, పెళ్లి, ఫంక్షన్ అయినా తన కుటుంబ సభ్యులు పిలుస్తున్నారని అనిపిస్తుందని తెలిపారు. రైతు భరోసా ద్వారా ఉచిత విద్యుత్, రూ.2లక్షల రైతు రుణమాఫీ, ప్రతిఏటా పట్టాదారులకు రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు, జాతీయ ఉపా ధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి వ్యవసాయాన్ని పండుగ చేస్తామన్నారు. గృహ జ్యోతి పథకం ద్వారా మహిళలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. అదే విధంగా గృ హలక్ష్మి పథకం, పింఛన్లు అందించడంతో పాటు తదితర పథకాలు అమలు చేస్తామని సీతక్క వివ రించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ రవిచందర్, వంగ రవియాదవ్, భిక్షపతి, ఎల్లావుల అశోక్, పొడాల ఓంప్రకాష్, బొంతల వేణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ములుగు మండలంలోని దేవనగర్ గ్రామానికి చెం దిన జంగ అంకమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. కాగా బాధిత కుటుంబ సభ్యులను ములుగు ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జాతీయ మహి ళా ప్రధాన కార్యదర్శి ధనసరి సీతక్క పరామర్శిం చారు. అనంతరం అంకమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు కొండం రవీందర్, మం డల అధ్యక్షుడు చాంద్‌పాషా, సంతోష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ములుగు : టీడీపీ మాజీ ఎంపీటీసీ, మండల మాజీ అధ్యక్షుడు లావుడ్య రమేశ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు ఎమ్మెల్యే సీతక్క కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచిం చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అనుబంధ సం ఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ మేనిఫెస్టో

కాటారం: రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమం, అభి వృద్ధే ఎజెండగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో రూపొందించడం జరిగిందని మంథని ఎమ్మెల్యే, పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్స్ లో సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీధర్‌బాబు హాజరై మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ఆరు గ్యారం టీ స్కీంలను రూపొందించినట్లు తెలిపారు. బీఆర్ ఎస్ పార్టీ ప్రజలకు చేసింది శూన్యం అని, బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొం టూ వచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ స్కీం లు, మేనిఫెస్టోను కాపీ కొట్టి బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రకటించారని ఆరోపించారు. నియోజకవర్గంలోని పేదవారికి ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీలు పంతకాని సమ్మయ్య, బాన్సోడ రాణిబాయి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్, ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు ఉన్నారు.

వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

వెంకటాపురం(కె) : కాచి చల్లార్చిన నీటినే ప్రజలు తాగాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మల్లాపురం, కొండాపురం, చిరుతపల్లి తదితర గ్రామాల్లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మం దులు అందజేశారు. అనంతరం పరిసరాల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసు కోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, స్థానికులు తదితరులు ఉన్నారు.

‘బీఆర్ఎస్‌పై నమ్మకంతోనే చేరికలు’



పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ కండువా కప్పుతున్న లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం : బీఆర్ఎస్‌పై ఉన్న నమ్మకంతోనే పలువురు పార్టీలో చేరుతున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు అన్నారు. సోమ వారం మండలంలోని రొయ్యూర్, శంకరాజుపల్లి గ్రామాల బీఆర్ఎస్ కమిటీ అధ్యక్షులు కురుమ శ్రీనివాస్, ఆత్కూరి రాంబాబు ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. మూడు మండలాల ఇన్‌చార్జ్ మెట్టు శ్రీనివాస్, లక్ష్మీ నర్సింహారావు కలిసి పార్టీలో చేరిన వారికి కండు వాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టో విడుదల చేసిందని, అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. బీజే పీకి చెందిన వంద మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారన్నారు. కార్యక్రమంలో ఏటూరు నాగారం మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కూనూరు మహేష్ గౌడ్, లక్ష్మీనారాయణ, శేఖర్, సందీప్, రొయ్యూరు సర్పంచ్ సమతఈశ్వర్, ఎంపీటీసీలు జాడి లక్ష్మీనారాయణ, కోట నరసింహులు, తిరు పతి, కూనూరు చిరంజీవి, ఉపసర్పంచ్ అల్లంల చంటి, దేవులపల్లి సమ్మయ్య, నూకల లక్ష్మీనారాయ ణ, ఎండి వలీబాబా, తాడూరి రఘు, మెరుగు వెం కటేశ్వర్లు, గండేపల్లి నర్సయ్య, రామకష్ణ ఉన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



మంగపేట: జిల్లా స్థాయి క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో ఎస్సై రవికుమార్ తదితరులు

మంగపేట : క్రీడలు మానసికోల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎస్సై గోదరి రవికుమార్ అన్నారు. మంగపేట మండల యూత్, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని కమలాపురంలో రేఖా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని ఎస్సై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మంగపేట యూత్ నాయకులు పల్లపు రమేష్, అజ్మత్‌పాష, బండి రాకేష్, అన్వేష్, కల్యాణ్, నవీన్, చల్లా రాంకీ, ఖలీద్, యువజన నాయకుడు కొమరగిరి సురేష్, షణ్ముక్, వెంకటసాయి, సాయి తేజ పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్ షిప్ ఏటూరునాగారం

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని గురుకుల క్రీడా పాఠశాల, కళాశాలలోని విద్యార్థులు అండర్ -14, 17, 19 విభాగాల్లో ఓవరాల్ చాంపియన్ షిప్‌గా నిలిచారు. సోమవారం మండల కేంద్రం లోని క్రీడా పాఠశాలలో ప్రతిభ కనబర్చిన 75 మం ది విద్యార్థులకు కళాశాల, పాఠశాల లెక్చరర్లు, ఉపా ధ్యాయులు అభినందనలు తెలిపారు. ములుగు జిల్లా ఇంచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జయశంకర్ భూపాలప ల్లి, ములుగు, వరంగల్ రీజనల్ 7వ జోనల్ స్థాయి క్రీడల్లో ఏటూరునాగారానికి చెందిన క్రీడా పాఠ శాల, కళాశాల విద్యార్థులు అథ్లెటిక్స్, వివిధ విభాగాల్లో గెలుపొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తుమికి వెంకటేశ్వరరాజు మాట్లా డుతూ.. విద్యార్థులు అన్ని క్రీడల్లో గెలుపొంది పాఠ శాలకు మంచి పేరు తీసుకువచ్చారన్నారు. ఐటీడీఏ పీఓ అంకిత్, ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మరిన్ని పతకాలను సాధిస్తామన్నారు. కార్యక్రమం లో కళాశాల పీడీ రమణ, స్కూల్ పీడీ శ్రీను, బాక్సింగ్ కోచ్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం: ఓవరాల్ చాంపియన్ షిప్‌ను అందుకుంటున్న విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మాజీ ఎమ్మెల్యే సత్యవతి మృతికి సంతాపం



ములుగు రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



ఎస్ఎస్‌తాడ్వాయిలో..

ములుగు రూరల్ : భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుం జా సత్యవతి మృతి నియోజకవర్గ ప్రజలకు తీరని లోటని భారతీయ జనతా పార్టీ నాయకులు అన్నారు. సత్యవతి చిత్రపటానికి బీజేపీ నాయకు లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు సోమవారం సత్యవతి మరణ వార్త తెలిసిన వెంటనే మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ ఆధ్వ ర్యంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి మాట్లా డుతూ.. భద్రాచలం ప్రజలకు ఆమె ఎనలేని సేవ లు అందించారన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్, సిరికొండ బలరాం, ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, రామరాజు, కృ ష్ణాకర్, కొత్త సురేందర్, గట్ట శ్రీనివాస్‌రెడ్డి, మహేం దర్, కుటుంబరావు, వినోద్, హేమాద్రి, సునీల్, వెంకట్, సారయ్య, సోమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి : భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకురాలు కుంజా సత్యవతి గుండెపోటు తో మృతి చెందడం పట్ల మండలంలోని బీజేపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. భద్రాచలం ప్రాంత ప్రజలకు, పార్టీకి చేసిన సేవ లను స్మరించుకున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూ రాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లెల రాంబాబు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జంగా హన్మంతరెడ్డి, మండల ఉపాధ్య క్షుడు సిద్దబోయిన పాపారావు, ఆలేటి జైపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి లక్ష్మణ్, సీనియర్ నాయకుడు మేడిశెట్టి పురుషోత్తం, బీజేవైఎం జిల్లా కార్యదర్శి అలకుంట చిన్న, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ సేనాపతి, మాదరి శ్రీకాంత్ చెంగల సుభాష్, పాయం ప్రేమ్‌నాథ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి పూజలు

గోవిందరావుపేట : మండలంలోని చల్వాయి రామ లింగేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కొలువైన దుర్గాదేవి సోమ వారం భక్తులకు బాలాత్రిపుర సుందరి అవతారం లో దర్శనమిచ్చారు. ఈ మేరకు వేదపండితుడు గోవర్ధన కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించగా మైత్రి వెంకన్న -స్వప్న దంపతులు పూజలో పాల్గొన్నారు. అమ్మ వారికి చీర సారెలతో, నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తు లు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా అమ్మవారు..

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో దేవీ శరన్నవ రాత్రుల్లో భాగంగా అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అర్చకులు ఎల్లప్రగడ నాగేశ్వర్ రావుశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కన్యకా పరమేశ్వరి ఆలయం, సాయిబాబా ఆలయం, క్రాస్‌రోడ్డు ఐటీడీఏ వద్ద, ముత్యాలమ్మ ఆలయం, శివాలయం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మ వారిని గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భవాని మాలధారులు భక్తి గీతాలను ఆలపించారు.

వెంకటాపురం(ఎం) : దేవీ శరన్నవరాత్రుల ఉత్స వాల్లో భాగంగా మండల కేంద్రంలో రెండో రోజు దుర్గామాత గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు రఘు నాథచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు చింతిరెడ్డి రమణారెడ్డి, ముప్పు పూర్ణేందర్, పల్నాటి సురేష్, అక్కపెల్లి అరవింద్, పోశాల చంద్రమౌళి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం(ఎం): అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



ఏటూరునాగారం: కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



ఏటూరునాగారం : రామాలయంలో..



గోవిందరావుపేటలో..



ఏటూరునాగారం: సాయిబాబా ఆలయంలో..



రామన్నగూడెంలో..



ముత్యాలమ్మ ఆలయం వద్ద..

తహసీల్దార్ ప్రత్యేక పూజలు



మంగపేట : మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీనర్సింహస్వా మిని తహసీల్దార్ బైరి వీరస్వా మి దర్శించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి సారిగా ఆలయానికి వచ్చిన తహసీల్దార్ దంపతులు, బంధువులకు ఆలయ అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆల యంలో స్వయంభు స్వామివారికి తహసీల్దార్ దంపతుల గోత్రనామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించారు. స్వామివారి విశిష్టతను, ఆలయ పురాణాన్ని వివరించి స్వామివారు, అమ్మవార్ల శేషవస్త్రాలను బహూకరించి వేద ఆశీర్వ చనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆర్ఐ కుమారస్వామి, జూనియర్ అసిస్టెంట్ నందకిశోర్, ఆలయ సిబ్బంది ఉన్నారు.